
సమరానికి సన్నద్ధం!

ఈ సారీ స్థానిక సమరం ఖాయమనే సంకేతాలు వస్తున్నాయి. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు. అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలతో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం వెళ్లనుందని స్పష్టం అవుతోంది. దీంతో పల్లెల్లో రాజకీయ హడావుడి మొదలైంది. ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. ప్రజాక్షేత్రంలోకి పరుగులు తీస్తున్నారు.



హైకోర్టు ఆదేశాలు..
అధికారుల సమీక్షలు

- ఆశావహుల హడావుడి
- నోటిఫికేషన్ కోసం ఎదురుచూపు
- నేతల్లో వినిపిస్తున్న భిన్న స్వరాలు
- గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయాలు

అబ్దుల్లాపూర్‌మెట్/ ఆమనగల్లు: స్థానిక ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. గత పాలకవర్గం గడువు ముగిసి ఏడాదిన్నర అయింది. నాటి నుంచి పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని, అక్కడి ప్రజల గురించి పట్టించుకునే నాథుడే లేడని ప్రతిపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. లోకల్ ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. హైకోర్టు స్పందించింది. దీంతో రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలతో పల్లెల్లో హడావుడి మొదలయింది.

సమయం ఆసన్నమైంది

అధికార పక్షం పంచాయతీ ఎన్నికలకు వెళ్లనుందన్న ప్రకటనలతో.. బరిలో నిలిచేందుకు తహతహలాడుతున్నవారిలో ఆతృత నెలకొంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కోసం సర్పంచ్, వార్డు సభ్యుల వారీగా గుర్తులను ఎంపిక చేయడంతో పాటు ఎంపీటీసీ స్థానాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను అధికారులు వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో పాటు తాజాగా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, రాజకీయ పార్టీలతో అధికారుల సమావేశాలు, ఓటర్ల జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ లాంటి పనులు శరవేగంగా జరగుతుండడంతో పోరుకు సమయం ఆసన్నమైందనే సంకేతాలు వస్తున్నాయి. దీంతో రాజకీయ రంగ ప్రవేశం చేద్దామనుకున్న వారితో పాటు, సీనియర్లు, రాజకీయ నేతల్లో టెన్షన్ మొదలైంది.

రిజర్వేషన్ల టెన్షన్

స్థానిక పోరులో పోటీ చేయాలనుకునే వారిని.. రిజర్వేషన్ టెన్షన్ వెంటాడుతోంది. మండలంలోని గ్రామాల్లోని జనాభా ప్రకారం 'మా ఊరిలో వచ్చే రిజర్వేషన్ ఏది' అని అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండంలోని నాలుగు గ్రామాలు సమీప పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ఆ గ్రామాల్లోని రెండు పంచాయతీల్లో గతంలో ఎస్సీ రిజర్వు అయిన సంగతి తెలిసిందే. అయితే ఆ రెండు ఎస్సీ స్థానాలను ప్రస్తుతం మిగిలి ఉన్న 14 పంచాయతీల్లోని ఏ గ్రామంలో రిజర్వు చేస్తారనే సందేహంలో నేతలు ఉన్నారు. అటు రిజర్వేషన్ల ఫైనల్.. ఇటు ఎన్నికల నోటిఫికేషన్ కోసం నేతలు, ఆశావహులు ఎదురు చూస్తున్నారు.

14 సర్పంచ్, 8 ఎంపీటీసీలు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 14 గ్రామాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 18 గ్రామాలకు గాను 4 పంచాయతీలను పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేశారు. 14 గ్రామాలను మండలంలోనే కొనసాగిస్తున్నారు. వీటికి తోడు 11 ఎంపీటీసీ స్థానాలకు గాను 3 స్థానాలు పురపాలక సంఘం పరిధిలో విలినమైన గ్రామాల్లో ఉండడంతో ప్రస్తుతం మండలంలో 8 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుని డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరిలో విడుదల చేశారు.

ముందుకా.. వెనక్కా?

పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వ తీరు ఒక్క అడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనకకు వేస్తోంది. ఏడాదిన్నర కాలంగా పోరుపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో అనేక అనుమానాలు తావిస్తోంది. సర్కారు ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియని అయోమయ స్థితిలో నేతలున్నారు. అయితే జరుగుతున్న పరిణామాలతో ఈ నెలాఖరులోగా ఎన్నికలు జరుగుతాయా లేక మరో సారి వాయిదా పడతాయా అంటూ పల్లెల్లో ఏ ఇద్దరు వ్యక్తులు ఎదరు పడినా ఇదే చర్చ. ఎన్నికలు నిర్వహిస్తే రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తే స్థానిక పోరులో తమ భవితవ్యాన్ని పరీక్షించుకుంటాం. లేదా వ్యాపారాలు చేసుకుంటాం. కానీ ఇలా ప్రభుత్వం ఊరిస్తుండడం మంచిది కాదని పలువురు నేతలు తమ అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారు.

అభ్యంతరాల స్వీకరణ

స్థానిక ఎన్నికల కోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఓటరు లిస్ట్, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించింది. వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని నేతలకు సూచించింది. ఇందులో భాగంగా ఈ నెల 8న అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. 10న ఓటరు లిస్ట్, పోలింగ్ కేంద్రాల జాబితాను అధికారులు ప్రకటించనున్నారు.

10వ తేదీ తర్వాత..

ప్రస్తుత నెలాఖరులోగా స్థానిక ఎన్నికలు పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం సీఎం దగ్గర నుంచి మంత్రులు, అధికారుల మధ్య జరుగుతున్న సమావేశాల్లో స్థానిక పోరుపైనే చర్చ కొనసాగుతుండటంతో పోరు ఇక ఖాయమనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అందరి అంచనా ప్రకారం ఈ నెల 10వ తేదీ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయి. కాగా జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు ముందు నిర్వహిస్తారా? పంచాయతీ ఎన్నికలు ముందా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

అగ్రనేతల ప్రసన్నం కోసం..

కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల్లో మొత్తం 102 గ్రామ పంచాయతీలు, 41 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఆమనగల్లులో 13, మాడ్గులలో 33, కడ్తాల్‌లో 24, తలకొండపల్లిలో 32 గ్రామాలు ఉన్నాయి. గత జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో ఆమనగల్లు, కడ్తాల్, ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఎస్టీలకు, మాడ్గుల, తలకొండపల్లిలో జనరల్‌కు కేటాయించారు. కాగా నాలుగు మండలాలలో ఎంపీపీ స్థానాలు మహిళలకే కేటాయించడం విశేషం. అయితే ఈ సారి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంది. దీంతో మార్పులు చేర్పులు ఉండటంతో అందరిలో ఉత్కంఠ మొదలైంది. సర్పంచ్ పదవికి పార్టీపరంగా బీఫాం ఉండని నేపథ్యంలో.. పోటీదారుల సంఖ్య ఘననీయంగా పెరగనుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీకి పార్టీ పరంగా బీ ఫారం తప్పనిసరి కాగా.. ఆశావహులు రాజకీయ అగ్రనేతలను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీ అయ్యారు.


ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం

చట్టాన్ని గౌరవించాలి


మధు, సీఐ

మంచాల: చట్టాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలని, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సీఐ మధు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో 232 వినాయక విగ్రహాలను భక్తులు ప్రతిష్ఠంపచేశారని, అందులో 216 ప్రతిమలను నిమజ్జనం చేశారని పేర్కొన్నారు. మిగతా 16 గణనాథులను గంగమ్మ ఒడికి చేర్చాల్సి ఉందన్నారు. ప్రజల సహకారంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా.. నిమజ్జన క్రతువు ప్రశాంతంగా సాగిందన్నారు.

10న ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఆమనగల్లు: ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేయనున్నామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, పీఆర్‌ఓ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమం చేపట్టనున్నామని, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీచర్లు హైమావతి, చందర్, నరేశ్, పుష్పాంజలి, కౌసల్య, రాజు, విష్ణు, జైసన్, మీనా కుమారి, స్వాతి, లక్ష్మణ్, మణిపాల్, పాండు, ప్రభాకర్ రెడ్డి, కళ, శ్రీనివాసులు, వైకుట్టన్, మోహన్, శివకుమార్, రాజేశ్వరీ, వజ్రలింగం, అనంతరావ్, రాజశేఖర్, విష్ణువర్ధన్, లచ్చిరాం, అంజయ్యలను సత్కరిస్తామన్నారు.

ముగిసిన నిమజ్జనోత్సవం

ఇబ్రహీంపట్నం: గణేశ్ నిమజ్జనోత్సవం అట్టహాసంగా ముగిసింది. శుక్ర, శనివారాల్లో భారీగా, ఆదివారం మరికొన్ని విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చారు. మున్సిపాలిటీ పరిధి శేరిగూడ, తట్టిఖానా చెక్ డ్యాంలలో.. స్థానిక గణనాథులే కాక పరిసర ప్రాంతాల నుంచి సుమారు 464 విగ్రహాలను వేసినట్లు అధికారులు వెల్లడించారు. సుమారు 98 శాతం నిమజ్జన క్రతువు ముగిసిందని, మరికొన్ని వినాయక మండపాలున్నాయని తెలిపారు. ప్రశాంతంగా ఉత్సవం జరగడంతో పోలీసులు, అధికారులు, నిర్వాహకులు ఊపిరిపీల్చుకున్నారు.

క్లుప్తంగా

జీఎస్టీ తగ్గింపు.. హర్షణీయం


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కడ్తాల్: నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గించడం హర్షణీయమని బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి అన్నారు. ఆదివారం మండల పరిధి మక్తమాదారం గ్రామంలో ఆ పార్టీ శ్రేణులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని పేద ప్రజలకు మేలు చేసేలా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ భారాన్ని తగ్గించడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్‌గౌడ్, బూత్ కమిటీ అధ్యక్షుడు రమేశ్, నర్సింహ, చిన్న రమేశ్, నర్సింహ, సత్తయ్య, రామయ్య, చంద్రయ్య, కాశయ్య, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

పోలీసు అధికారులకు సన్మానం


సీఐ, ఎస్‌ఐలను సన్మానించిన నాయకులు

కడ్తాల్: చవితి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా విధులు నిర్వహించిన పోలీసులను పలువురు నాయకులు అభినందించారు. ఆదివారం ఠాణాలో సీఐ గంగాధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్‌లను వారు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఇందులో ముత్తికృష్ణ, అంజి, రమేశ్, సిద్దిగారి రమేశ్, మాదారం మహేశ్, సుమన్, శ్రీకాంత్, రాజు, మణి, నరేశ్, మహేశ్ ఉన్నారు.

నూతన కమిటీ నియామకం


మాట్లాడుతున్న నర్సింహ

ఇబ్రహీంపట్నం రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆదిబట్ల మున్సిపాలిటీ కన్వీనర్ తులసీగారి నర్సింహ డిమాండ్ చేశారు. ఆదివారం మంగళపల్లి మహమ్మాయిదేవి ఆలయ ప్రాంగణంలో భోజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా మంజుల, అధ్యక్షులుగా కల్పన, ప్రధాన కార్యదర్శిగా మౌనిక, కోశాధికారిగా కవిత, ఉపాధ్యక్షులుగా శారద, సహాయ కార్యదర్శిగా ఉమాదేవి, కమిటీ సభ్యులుగా అజీబీ, రాములమ్మ, బుజ్జమ్మలను నియమించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు.

హమాలీ సంఘం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

ఆమనగల్లు: హమాలీ సంఘం తలకొండపల్లి మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పెంటయ్య, గౌరవ అధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, ఉపాధ్యక్షులుగా లక్ష్మయ్య, కృష్ణయ్య, సహాయ కార్యదర్శులుగా మల్లయ్య, జంగయ్య, కోశాధికారిగా రమేశ్, సభ్యులుగా మల్లేశ్, మైసయ్య, దుర్గయ్య, జంగయ్య, మహేశ్, శ్రీను, శేఖర్, జంగయ్యలను నియమించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కందుకూరు: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని ఆకులమైలారంలో భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులు తమ శ్రమతో పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తారని, కాగా వారు ఉండటానికి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వారికి ఉండటానికి స్థలం చూపి.. ఇల్లు నిర్మించాలని, లేబర్ కార్డులు జారీ చేసి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అనంతరం లేబర్ కార్డుల కోసం కార్మికులతో దరఖాస్తు చేయించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య, కార్యదర్శి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


వంశీచంద్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో యువతను ఆకర్షించి, ప్రభుత్వ పథకాలను, పార్టీ ఆలోచనలను ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా పాత్ర కీలకంగా మారిందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఇటీవల సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులైన విష్ణువర్ధన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఆదివారం నగరంలో చల్లాను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా విష్ణువర్ధన్ నియామక పత్రం అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా ప్రజా సమస్యలను వెలుగులోకి తేవాలని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు.

రావినారాయణరెడ్డికి నివాళి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మీర్‌పేట: పీడిత వర్గాలకు భూమితో పాటు మొత్తం ఆస్తిని దానం చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి అని సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం రావి నారాయణ రెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా లెనిన్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమానికి రావి నారాయణరెడ్డి తన జీవితాన్ని అంకితం చేయడంతో పాటు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారని కొనియాడారు. ఆయన సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

యాదవుల సమస్య పరిష్కారానికి కృషి


నూతన కార్యవర్గ సభ్యులు

ఇబ్రహీంపట్నం: యాదవుల సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఆ సంఘం ఇబ్రహీంపట్నం నూతన అధ్యక్షుడు ముంత శంకర్‌యాదవ్ అన్నారు. కుల పెద్దల సమక్షంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శంకర్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా ఐలయ్య, కోశాధికారులుగా నర్సింహ్మ, శివాజీ, కార్యదర్శిగా జనిగే లింగం, సలహాదారులుగా నగేష్, సతీష్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. త్వరలో మల్లన్న పండుగను ఘనంగా నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు యూరియా అందించడంలో విఫలం

మొయినాబాద్: రైతులకు సరిపడా యూరియా అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి విమర్శించారు. ఆదివారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యూరియా కోసం ప్రతి రోజు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. నెల రోజులకుపైగా రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టడంలేదని మండిపడ్డారు. సీజన్‌కు ముందే సరిపడా యూరియాను అందుబాటులో పెట్టాల్సిన సీజన్ దాటిపోతున్నా అందించలేకపోతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ప్రతి రోజు రైతులు ఎరువుల కోసం పీఏసీఎస్‌లు, ఫర్టిలైజర్ షాపుల వద్ద బారులు తీరుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు రైతులకు అనేక రకాల హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. రుణమాఫీ, రైతు భరోసా రైతులందరికీ ఇవ్వలేదని మండిపడ్డారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ముచ్చర్ల వాసులు

కందుకూరు: తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని ముచ్చర్ల వాసులు ఆదివారం ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిసి కోరారు. ముచ్చర్ల నుంచి పోతుబండతండా వరకు రహదారి నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆమెకు వినతి పత్రం అందించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. రహదారి నిర్మాణానికి రూ.2.72 కోట్లు మంజూరయ్యాయని, టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే త్వరలో పనులు ప్రారంభమవుతాయని వారికి తెలిపారు. కార్యక్రమంలో డేరంగుల మోహన్, డేరంగుల శ్రీనివాస్, బండ నర్సింహ, వరికుప్పల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల సభను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రవిమాదిగ

మహేశ్వరం: కందుకూరులో ఈ నెల 8వ తేదీన జరుగనున్న పెన్షన్‌దారుల సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మహేశ్వరం మండల ఇన్‌చార్జి బక్కని రవిమాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని గట్టుపల్లి, కల్వకోల్ గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఆవరణల వద్ద పెన్షన్‌దారుల చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు పెన్షన్ రూ.6వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేశ్‌మాదిగ, నాయకులు ఎర్ర నవీన్‌మాదిగ, మహేందర్‌మాదిగ, పెంజర్ల నర్సింహ, శివరాజ్‌గౌడ్, బక్కని సత్తయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత


అంబాభవానీమాత దేవాలయాన్ని మూసివేస్తున్న అర్చకుడు మల్లేశ్

షాద్‌నగర్‌రూరల్: భాద్రపద శుక్ల పౌర్ణమిని పురస్కరించుకొని సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా దేవాలయాలను ఆదివారం అర్చకులు మూసివేశారు. పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, మండల పరిధిలోని రామేశ్వరంలోని ఉత్తర రామలింగేశ్వస్వామి దేవాలయం, మొగిలిగిద్ద సమీపంలోని శ్రీగోదారంగనాయకస్వామి దేవాలయాలను మధ్యాహ్నం 12:30 గంటలకు, ఎలికట్ట శ్రీఅంబాభవానీమాత దేవాలయం మధ్యాహ్నం 3:30గంటలకు అర్చకులు మూసివేశారు. గ్రహణం రాత్రి 9:56 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి 01:26 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రహణ సమయానికి ముందుగానే భోజనం చేయాలని, తదుపరి చేయరాదని వివరించారు. సోమవారం ఆలయ సంప్రోక్షణ, అభిషేకం తర్వాత ఉదయం 8 గంటలకు అన్ని దేవాలయాల్లో భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తామని ఈఓ శివకుమార్ స్పష్టం చేశారు. ఈ సంపూర్ణ చంద్రగ్రహణం భారతదేశంలోని అన్ని ప్రాంతాల్లో కనిపిస్తుందని తెలిపారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు


ఆమనగల్లు: శివసేన యూత్ గణనాథుడి సన్నిధిలో భక్తజనం


ఆమనగల్లు: ఆదర్శనగర్ కాలనీలో లడ్డూను దక్కించుకున్న భక్తుడు సత్యనారాయణరెడ్డి


మంచాల: ఆరుట్లలో విద్యుత్ దీపాలతో శోభాయాత్ర

చవితి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గణపతుల నిమజ్జన క్రతువు కనుల పండువగా కొనసాగింది. నవ రాత్రులు పూజలందుకున్న స్వామి వార్ల నిమజ్జనం ముగియగా.. పలుచోట్ల 11 రోజుల్లో భాగంగా ఆదివారం నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఉత్సవమూర్తులను అంగరంగ వైభవంగా ఆటపాటలతో ఊరేగించారు. పోయిరావయ్యా అంటూ పార్వతీపుత్రుడను గంగమ్మ ఒడికి చేర్చారు. –సాక్షి, నెట్‌వర్క్


ఆమనగల్లు: సురసముద్రంలో వినాయకుడి నిమజ్జనం


మంచాల: చిత్తాపూర్‌లో..


మంచాల: ఆరుట్లలో కళాకారుల నృత్యం


ఇబ్రహీంపట్నం: ఎలిమినేడులో రూ.40 వేలకు లడ్డూను సొంతం చేసుకున్న భక్తుడు నర్సింహ్మ